క్లుప్తంగా

క్రీడా పరికరాలు పంపిణీ



మోపిదేవి: విద్యార్థులకు చదువుతో పాటు శారీరక వ్యాయామం అవసరమని విశ్రాంత పోలీస్ అధికారి తోట సాంబశివరావు అన్నారు. మోపిదేవి జెడ్పీ పాఠశాల విద్యార్థులకు వాలీబాల్, బాస్కెట్‌బాల్, క్యారంబోర్డు, షటిల్, త్రోబాల్ కిట్‌లను సాంబశివరావు ఆర్థిక సాయంతో పాఠశాలకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లోనూ ప్రతిభ చూపాలని చెప్పారు. పాఠశాల హెచ్ఎం జయంతి, స్థానిక ఎస్ఐ పద్మ, ఉపాధ్యాయులు సాంబశివరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అవనిగడ్డ ఉప సర్పంచ్‌గా సత్యనారాయణ

అవనిగడ్డ: అవనిగడ్డ ఉప సర్పంచ్‌గా కోడూరు సత్యనారాయణను ఎన్నుకున్నారు. పంచాయతీ పాలకవర్గం ఏర్పడిన తరువాత ఉప సర్పంచ్ పదవి మొదటి రెండున్నరేళ్లు ఒకరు, మరో రెండున్నరేళ్లు ఇంకొకరు అనే ఒప్పందం కుదుర్చుకున్నారు. దీని ప్రకారం గతంలో ఉప సర్పంచ్‌గా ఉన్న గాజుల జయగోపాల్ రెండున్నరేళ్ల పదవీ కాలం పూర్తవడంతో తప్పుకున్నారు. శుక్రవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఉప సర్పంచ్‌గా కోడూరు సత్యనారాయణను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సత్యనారాయణను పలువురు అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ గౌరుముచ్చు ఉమా, ఈఓ తోట శ్రీనివాసరావు, పలువురు పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ శాఖ ఇన్‌చార్జి డీడీగా శ్రీనివాసరావు



చిలకలపూడి(మచిలీపట్నం): వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఇన్‌చార్జి డెప్యూటీ డైరెక్టర్‌గా ఎ. శ్రీనివాసరావును నియమిస్తూ కలెక్టర్ పి. రంజిత్‌బాషా శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. ఇప్పటి వరకు డెప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న సీహెచ్ లక్ష్మీదుర్గ వ్యక్తిగత కారణాల నిమిత్తం సెలవుపై వెళ్లారు. దీంతో ఈయన స్థానంలో బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసరావుకు కలెక్టర్ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

నగరంలో 97.92 శాతం పింఛన్ల పంపిణీ

మచిలీపట్నంటౌన్: సామాజిక పింఛన్ల పంపిణీ నగరంలో మూడో రోజైన శనివారం 97.92 శాతం పూర్తి చేశారు. నగరంలో మొత్తం 18,775 పింఛన్లు ఉండగా వీటిలో 18,384 పింఛన్లను పంపిణీ చేశారు. దీంతో జిల్లాలో పింఛన్ల పంపిణీలో నగరం నాలుగో స్థానంలో ఉంది. పలు డివిజన్లలో వలంటీర్లతో కలిసి ఆయా డివిజన్ కార్పొరేటర్లు, వైఎస్సార్ సీపీ కన్వీనర్లు, గృహ సారథులు పింఛన్లను పంపిణీ చేశారు.

మృతుని కుటుంబానికి సాయం

కోసూరువారిపాలెం(మోపిదేవి): కోసూరువారిపాలెం పీఏసీఎస్ సభ్యుడు కోసూరు వీరరాఘవయ్య జనవరి 23న మృతి చెందాడు. మృతుని కుమార్తె జోషి ప్రియాంకకు చైర్‌పర్సన్ కోసూరు కోటేశ్వరరావుచే రూ. 10 వేలు నగదు అందజేశారు. సొసైటీ కార్యదర్శి వన్నెంరెడ్డి నాగరాజు, సిబ్బంది కోసూరు వెంకటరమణ, కోసూరు రేణుకయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి ఉత్సవ ఊరేగింపు

చిలకలపూడి(మచిలీపట్నం): పెదకరగ్రహారం గ్రామంలోని లక్ష్మీ నరసింహస్వామి ఉత్సవ ఊరేగింపు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు పెద్దఎత్తున స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను వైఎస్సార్ సీపీ నాయకులు శొంఠి ఫరీద్, శీలం బాబ్జి తదితరులు పర్యవేక్షించారు.

కుష్ఠు వ్యాధి నియంత్రణపై అవగాహన



బంటుమిల్లి: కుష్ఠు రహిత సమాజ నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని సర్పంచ్ దూసనపూడి అవతారం అన్నారు. మల్లపరాజుగూడెం గ్రామంలో శుక్రవారం కుష్ఠు వ్యాధి నివారణ పక్షోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. పెదతుమ్మిడి పీహెచ్‌సీ వైద్యులు సువర్చల, సిబ్బంది పాల్గొని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. మల్లేశ్వరం ఏఎంసీ వైస్ చైర్మన్ పి. బాబూరావు, సూపర్‌వైజర్లు ఎం. ఏసుదాసు, ప్రసాదు, భారతి, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దేశానికే ఆదర్శంగా జగనన్న పాలన



స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి జోగి రమేష్



ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న పేర్ని కిట్టు

- మంత్రి జోగి రమేష్
- మల్లవోలులో గడప గడపకు మన ప్రభుత్వం

గూడూరు: సంక్షేమ పథకాలు అమలు చేయడంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశంలోనే ముందంజలో ఉందని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. గూడూరు మండలం మల్లవోలు పంచాయతీలోని మల్లవోలు-1 గ్రామ సచివాలయం పరిధిలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. మంత్రి జోగి రమేష్ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల ద్వారా పొందిన లబ్ధిని వివరిస్తూ ముద్రించిన బ్రోచర్లను అందజేశారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మంత్రి మాట్లాడుతూ జగనన్న సారథ్యంలో సంక్షేమ పథకాల అమలు పారదర్శకంగా జరుగుతోందన్నారు. పార్టీలకు అతీతంగా అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నామని చెప్పారు. సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శప్రాయమన్నారు. వికేంద్రీకరణ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయన్నారు.

పాలనలో వ్యత్యాసాన్ని గమనించండి..

సంక్షేమాభివృద్ధిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు, గత ప్రభుత్వ పాలనకు తేడాను గమనించాలని మంత్రి జోగి రమేష్ ప్రజలను విజ్ఞప్తి చేశారు. నవరత్నాలతో ప్రజల ముఖాల్లో సంతోషాలే ఇందుకు నిదర్శనమన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తూ.చా. తప్పకుండా అమలు చేస్తున్న ఘనత జగనన్నకే దక్కుతుందని చెప్పారు. వలంటీర్ల ద్వారా ప్రతి నెలా ఒకటో తేదీన అవ్వాతాతకు పెన్షన్‌తో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ ప్రజల గడప వద్దకే చేర్చుతున్నామన్నారు. ఇంటికి పెద్ద కొడుకగా చెప్పుకునేలా అద్భుత పరిపాలనతో ప్రతి ఒక్కరి గుండెల్లో స్థానం సాధించిన జగనన్నను నిండు మనస్సుతో ఆశీర్వదించాలని మంత్రి కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ సంగా మధుసూదనరావు, జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు, సర్పంచి బొర్రా సాంబశివయ్య, ఆర్బీకే చైర్మన్ పర్ణం పెదబాబు, పీఏసీఎస్ చైర్మన్ దాసరి రమేష్, ఎంపీటీసీ సభ్యులు మెట్ల సాయికుమారి, పిట్ల రామిరెడ్డి, పిచ్చుక సుబ్రహ్మణ్యం, ముజీబుల్ రహ్మాన్ తదితరులు పాల్గొన్నారు.

'గడప గడప'తో సమస్యల పరిష్కారం

మచిలీపట్నంటౌన్: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంతో డివిజన్లలో నెలకొన్న సమస్యలు పరిష్కారమవుతున్నాయని వైఎస్సార్ సీపీ నాయకుడు పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం పదో డివిజన్‌లో నిర్వహించారు. కార్పొరేటర్ షేక్ ముంతాజ్ బేగం, వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి షేక్ బాషాతో కలిసి ఆయన గడప గడపకు వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నవరత్న పథకాల ద్వారా ఆయా ప్రాంత ప్రజలకు అందిన వివరాలతో ముద్రించిన బుక్‌లెట్లను లబ్ధిదారులకు అందజేశారు. పేర్ని కిట్టు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి డివిజన్‌కు రూ. 20 లక్షలు మంజూరు చేస్తోందని, ఈ నిధులతో సంవత్సరాలుగా పరిష్కారం కాని సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. విద్యుత్ సంబంధిత సమస్యల పరిష్కారం కూడా జరుగుతోందని వివరించారు. కార్యక్రమంలో బొర్రా నటేష్, కార్పొరేటర్ మీర్‌అస్గర్‌అలీ, వైఎస్సార్ సీపీ నాయకులు, డివిజన్ ఇన్‌చార్జీలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట

ఎమ్మెల్యే పేర్ని నాని



పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పేర్ని నాని. చిత్రంలో మేయర్ వెంకటేశ్వరమ్మ

మచిలీపట్నంటౌన్: నగరంలోని అన్ని డివిజన్లలో మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తున్నామని ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) అన్నారు. ఎనిమిదో డివిజన్ ఆర్టీసీ కాలనీలో శుక్రవారం అమృత్ పథకంలో భాగంగా రూ. 38 లక్షలతో నిర్మించనున్న పైప్‌లైన్ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. పేర్ని నాని మాట్లాడుతూ నగరంలోని పలు కాలనీల్లో సిమెంట్ రోడ్లు, పక్కా డ్రెయిన్లు, పైప్‌లైన్లు నిర్మించేందుకు కోట్లాది రూపాయలను వెచ్చిస్తున్నామని చెప్పారు. నగరంలోని ప్రతిపక్ష డివిజన్లలో ఎలాంటి పక్షపాతానికి తావులేకుండా లక్షలాది రూపాయలను వెచ్చించి అభివృద్ధి పనులు చేస్తున్నామని తెలిపారు. జరుగుతున్న పనులను పట్టించుకోకుండా ప్రజలకు టీడీపీ నాయకులు అసత్యాలను చెబుతున్నారన్నారు. ప్రతిపక్ష కార్పొరేటర్లు ప్రాతినిథ్యం వహిస్తున్న డివిజన్లలో జరిగిన అభివృద్ధిపై టీడీపీ నాయకులు చర్చకు రావాలని ఆయన సవాల్ విసిరారు. కార్యక్రమంలో నగర మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, డెప్యూటీ మేయర్ తంటిపూడి కవిత థామస్ నోబుల్, ఇన్‌చార్జి కమిషనర్ పి. శ్రీకాంత్, కార్పొరేటర్ శ్రీరాం లక్ష్మణకుమార్ (చిన్నా), కార్పొరేటర్లు మాచవరపు రాంప్రసాద్, యండ్రపాటి నాగేశ్వరరావు, జిల్లా సాఫ్ట్‌బాల్ ఫెడరేషన్ చైర్మన్ గూడవల్లి నాగరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు చిటికిన నాగేశ్వరరావు, ధనికొండ శ్రీనివాసరావు, మొహమ్మద్ రఫీ, బూరగ రామారావు, చీలి చక్రపాణి, మేడెంపూడి అనిల్ బాబు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ



మచిలీపట్నంటౌన్: చిలకలపూడిలోని కామాక్షి సమేత రత్నాంబరేశ్వరస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాలను శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో వేద పారాయణ, గోపూజ, గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగవ్యం, రక్షాబంధన్ తదితర పూజా కార్యక్రమాలు జరిగాయి.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

పెదకళ్లేపల్లి(మోపిదేవి): పెదకళ్లేపల్లిలోని దుర్గా నాగేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలు ఈ నెల 15 నుంచి 23వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు తెలిపారు. బ్రహ్మోత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించి మాట్లాడారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు.

సస్యరక్షణ చర్యలతో తెగుళ్ల నివారణ



మినుము పైరుపై తెగుళ్లను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

గూడూరు: మినుము పంట సాగులో కనిపిస్తున్న కాండం గజ్జి తెగులు, బూడిద తెగులు నివారణకు రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని గుంటూరు జిల్లా లాంఫామ్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రం (ఆర్ఏఆర్ఎస్) ప్రిన్సిపల్ సైంటిస్ట్ పి.వెంకట్రావు, ఉయ్యూరు డాట్ సెంటర్ కో-ఆర్డినేటర్ ఎం.నందకిషోర్ అన్నారు. లాంఫామ్ ఆర్ఏఆర్ఎస్, ఉయ్యూరు డాట్ సెంటర్ శాస్త్రవేత్తలు సంయుక్త క్షేత్ర స్థాయి పరిశీలనలో భాగంగా శుక్రవారం గూడూరు గ్రామంలోని మినుము పైరును పరిశీలించారు. పైరులో కాండం గజ్జి, బూడిద తెగులును గుర్తించిన శాస్త్రవేత్తలు మాట్లాడుతూ వీటి నివారణకు సూచనలు చేశారు. తేలికపాటి నేలల్లో కార్బండిజం ఒక గ్రాము రసాయనం లీటరు నీటిలో కలిపి మొక్క మొదలులోని నేల తడిచేలా పిచికారీ చేయాలన్నారు. బరువు నేలల్లో మెటల్ అక్సిల్+ ఎం-45 మందు లీటరు నీటిలో 1.2 గ్రాములు మిశ్రమంగా చేసి పిచికారీ చేయాలని చెప్పారు. బూడిద తెలుగు నివారణకు లీటరు నీటిలో హెక్సకొనజోల్ రెండు మిల్లీ లీటర్లు మిశ్రమం చేసి పిచికారీ చేయాలన్నారు. తద్వారా తెగుళ్లను నివారించి అధిక దిగుబడులు సాధించాలని రైతులను విజ్ఞప్తి చేశారు. శాస్త్రవేత్తలు పి.కిషోర్, ఎన్.కామాక్షి, ఎన్.హరిసత్యనారాయణ, కె.అచ్యుతరాజు, మచిలీపట్నం డీఆర్సీ డీడీఏ కె.జ్యోతిరమణి, ఏడీఏ కె.శ్రీనివాసరావు, ఆర్బీకే చైర్మన్ పోతన వేణుబాబు తదితరులు పాల్గొన్నారు.

9న దేవస్థానం కోనేరు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ ఏసీ చక్రధరరావు



కోనేరును పరిశీలిస్తున్న ఆలయ ఏసీ చక్రధరరావు

మోపిదేవి: స్థానిక వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి దేవస్థానం కోనేరును రూ. 1.50 కోట్లతో అభివృద్ధి చేయనున్నామని, అభివృద్ధి పనులను ఈనెల 9వ తేదీన అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు శంకుస్థాపన చేస్తారని ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు తెలిపారు. కోనేరును శుక్రవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రసిద్ధ పుణ్యక్షేత్రాల్లో సీజీఎస్ మ్యాచింగ్ గ్రాంట్ నిధులతో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిందన్నారు. అందులో భాగంగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి దేవస్థానం రూ. 50 లక్షలు, సీజీఎస్ ఫండ్ రూ. ఒక కోటి మొత్తం రూ. 1.50 కోట్లతో పుష్కరిణి పనులు చేయనున్నామని వివరించారు. ఆలయ అధికారులు చెన్నకేశవ, నాగరాజు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్ఐ పద్మ

మోపిదేవి: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండి మంచి అలవాట్లతో బాగా చదివి ఉన్నతులుగా ఎదగాలని స్థానిక ఎస్ఐ పద్మ అన్నారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల అనర్థాలు, రహదారి భద్రతపై మోపిదేవి జెడ్పీ పాఠశాల విద్యార్థులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ ఎక్కువ సమయం ఫోన్ వినియోగించరాదని, దురలవాట్లకు దూరంగా ఉండాలని చెప్పారు. పాఠశాల హెచ్ఎం జయంతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

- ఘంటసాల(అవనిగడ్డ): యువత మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని చల్లపల్లి సీఐ బి.భీమేశ్వర రవికుమార్ అన్నారు. ఘంటసాల వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో శుక్రవారం మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలు, రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని చెప్పారు. మత్తు పదార్థాలకు బానిస కావడం వల్ల జీవితాలు నాశనం అవుతాయన్నారు. ఎస్ఐ కూచిపూడి శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బుద్ధుని మార్గం ఆచరణీయం

ఘంటసాల(అవనిగడ్డ): ప్రపంచ దేశాలకు ఆదర్శమూర్తి అయిన బుద్ధుని మార్గం అందరికీ ఆచరణీయమని మాజీ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్ అన్నారు. ఘంటసాల బౌద్ధస్థూపం వద్ద శుక్రవారం సద్ధమ్మ ఉపోసత క్యాలెండర్‌ను బౌద్ధ భిక్షువు బంతేజీతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. ఘంటసాలను బౌద్ధక్షేత్రంగా, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ జీవీ రామకృష్ణ, రిటైర్డ్ ఈఓపీఆర్డీ దాసి సీతారామరాజు, పరిశె చలపతి పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన




అవనిగడ్డ: స్థానిక రాజీవ్‌గాంధీ సెంటర్‌లో ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై సీఐ జి. శ్రీనివాస్ శుక్రవారం అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని, వాహనం నడిపేటప్పుడు ఫోన్‌లో మాట్లాడరాదని చెప్పారు. మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని చెప్పారు. అనంతరం డ్రైవర్లతో ప్రతిజ్ఞ చేయించారు. పోలీసు సిబ్బంది, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ

పెడన: స్థానిక సహాయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వెస్టిజ్ మార్కెటింగ్ ప్రైవేట్ లిమిటెడ్ వారి సహకారంతో మహిళలకు ఉచిత కుట్టు మిషన్ తరగతులు నిర్వహిస్తున్నామని ఫౌండేషన్ ప్రతినిధులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల మహిళలు ఈ నెల 6వ తేదీ లోగా స్థానిక భట్టా జ్ఞాన కోటయ్య ఉన్నత పాఠశాలకు ఎదురుగా ఉన్న రాధాకృష్ణ భవన సముదాయంలోని శివార్జున నైపుణ్యాభివృద్ధి కేంద్రంలో తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. శిక్షణ తరగతులు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయని చెప్పారు.

పెన్షనర్ల వితరణ



మచిలీపట్నంటౌన్: 28వ డివిజన్‌కు చెందిన ఇద్దరు పింఛనుదారులు అబ్దుల్ బెహరున్నీసా, ముంతాజ్‌బేగంలు జనవరి నెలలో మృతిచెందారు. తోటి పింఛనుదారులు వారి పింఛనులో నుంచి ఒక్కొక్కరు రూ. 100 చొప్పున వసూలు చేసిన మొత్తం రూ. 37,200 మృతుల కుటుంబ సభ్యులకు శుక్రవారం అందజేశారు. వారు మాట్లాడుతూ వచ్చే నెలలో కూడా ఒక్కొక్కరి నుంచి రూ. 100 చొప్పున వసూలు చేసి మృతుల కుటుంబాలకు అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి షేక్ మొహమ్మద్ సాహెబ్, వైఎస్సార్ సీపీ నాయకుడు షేక్ జలీల్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఆర్బీకే సేవలను సద్వినియోగం చేసుకోవాలి

చిలకలపూడి(మచిలీపట్నం): ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలను ఆయా ప్రాంతాల రైతులు సద్వినియోగం చేసుకోవాలని గ్రామ వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు మేకా వెంకటరత్నం అన్నారు. మేకావానిపాలెంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. వెంకటరత్నం మాట్లాడుతూ గ్రామ స్థాయిలో రైతులకు సేవలు అందించేందుకు ప్రభుత్వం ఆర్బీకేలను ఏర్పాటు చేసిందన్నారు. వేరుశనగ సాగు రైతులకు పలు సూచనలు చేశారు. మండల వ్యవసాయాధికారి జీవీ శివప్రసాద్ మాట్లాడుతూ వేరుశనగ సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పురుగు మందుల వినియోగం తదితరాలను వివరించారు. పులిగడ్డ సురేంద్ర, ఎస్. నాగేంద్ర, కొల్లు సురేష్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మచిలీపట్నంటౌన్: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఈఈ ఎం. భాస్కరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.30 నుంచి 10.30 గంటల వరకు గొడుగుపేట, చెమ్మనగిరిపేట, చల్లరాస్తా సెంటర్ ప్రాంతాల్లో, ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకు పాత హౌసింగ్ బోర్డు, కొత్త హౌసింగ్ బోర్డు, డ్రైవర్స్ కాలనీ, గుమాస్తాల కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని చెప్పారు.

దివిసీమలో విశ్వనాథ్ మూడు సార్లు పర్యటన

- విశ్వనాథ్ చిత్ర గీతాలకు విద్యార్థుల నృత్య నీరాజనం
- నృత్య ప్రదర్శనకు 2017లో తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం



విశ్వనాథ్ చిత్రాల్లోని గీతాలకు నృత్యం చేస్తున్న విద్యార్థినులు (ఇన్‌సెట్) నృత్యం తిలకిస్తున్న విశ్వనాథ్ (ఫైల్)

అవనిగడ్డ: ఎన్నో అద్భుత చిత్రాలను తెరకెక్కించి ప్రేక్షకుల మదిలో చెరగని ముద్ర వేసిన దర్శక దిగ్గజ దర్శకుడు కళాతపస్వి, దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత, దివంగత కె. విశ్వనాథ్‌కు దివిసీమతో ప్రత్యేక అనుబంధం ఉంది. ఆయన మూడు సార్లు దివిసీమలో పర్యటించారు. 2017లో విశ్వనాథ్ పాటలతో అవనిగడ్డలో నిర్వహించిన నృత్య నీరాజనం తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించింది. 2017 సెప్టెంబర్ 12 వ తేదీన అవనిగడ్డ గాంధీ క్షేత్రంలో మాజీ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లోని 12 స్కూల్స్, కళాశాలలకు చెందిన 1200 మంది విద్యార్థులు విశ్వనాథ్ దర్శకత్వం వహించిన 15 చిత్రాల్లోని 15 పాటలకు నృత్య ప్రదర్శనతో ఆయనకు నీరాజనం అందించారు. ఒక్కో పాటకు వంద మంది విద్యార్థులు చేసిన నృత్యంతో విశ్వనాథ్ మంత్ర ముగ్ధులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో కష్టపడి విద్యార్థులు నృత్యం చేశారని, ఈ రికార్డు వారికే దక్కుతుందన్నారు. ఇంతటి చక్కటి కార్యక్రమాన్ని తన జీవితంలో చూడలేదని కితాబిచ్చారు. ఈ నృత్యంలో పాల్గొన్న చిరంజీవులందరూ 'కైలాస శిఖరాలపై ఆనంద తాండవం చేస్తున్న శివపార్వతులు తమ బాల్యంలో చేసిన నృత్యంలా అనిపించింది' అని నిర్వహణ రికార్డులో తన స్వ దస్తూరీతో రాసి ఆయన సంతకం చేశారు. మోపిదేవి మండలం పెదకళ్లేపల్లిలో 1998లో దివంగత సినీ గేయ రచయిత వేటూరి సుందర రామ్మూర్తి నిర్వహించిన సంగీత సాహిత్యోత్సవాలు కార్యక్రమానికి విశ్వనాథ్ ఎస్‌పి బాలసుబ్రహ్మణ్యంతో కలిసి పాల్గొన్నారు.

ఘన నివాళి..

అవనిగడ్డ: దివంగత కె. విశ్వనాథ్ తెలుగు సినీ జగత్తులో ఓ ఆణిముత్యమని మాజీ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్ అన్నారు. స్థానిక గాంధీక్షేత్రంలో విశ్వనాథ్ సంతాప సభ శుక్రవారం జరిగింది. విశ్వనాథ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ తెలుగు సినీ రంగం గొప్ప తపస్విని కోల్పోయిందన్నారు. ఆయన తీసిన ఒక్కో చిత్రం ఒక్కో ఆణిముత్యమని చెప్పారు. ఆయన మరణం తెలుగు సినీ, సాహితీ, కళా రంగాలకు తీరని లోటన్నారు. గ్రామీణ వికాస సమితి అధ్యక్షుడు మండలి వెంకట్రావ్ (రాజా), మాజీ జెడ్పీటీసీ కొల్లూరి వెంకటేశ్వరరావు, గాంధీక్షేత్రం కమిటీ ప్రధాన కార్యదర్శి మత్తి శ్రీనివాసరావు, కళాకారులు పుప్పాల వీరాంజనేయులు పాల్గొన్నారు.

ఘనంగా ఎంసీఏ విద్యార్థుల ఫ్రెషర్స్‌డే వేడుకలు



మాట్లాడుతున్న వైస్ చాన్సలర్ రామ్మోహనరావు

చిలకలపూడి(మచిలీపట్నం): కృష్ణా విశ్వవిద్యాలయంలో ఎంసీఏ (మాస్టర్స్ ఇన్ కంప్యూటర్ అప్లికేషన్స్) విభాగం విద్యార్థులు శుక్రవారం ఫ్రెషర్స్‌డే వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథి వైస్ చాన్సలర్ కె. రామ్మోహనరావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తరగతికే పరిమితం కాకుండా పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యం పెంపొందించుకోవాలన్నారు. అప్పుడే ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని చెప్పారు. కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి ఆర్. కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ఎంసీఏ విద్యార్థులకు కావాల్సిన అన్ని సౌకర్యాలు ఇప్పటికే సమకూర్చామని, వాటిని వినియోగించుకుని ఉన్నత స్థానానికి చేరాలని ఆకాంక్షించారు. యూనివర్సిటీ డీన్ వైకే సుందరకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఎం. రామిరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ బాబురెడ్డి, కెమిస్ట్రీ విభాగాధిపతి రామశేఖరరెడ్డి, విజయకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మీపురం కేసీపీలో మినప గుళ్ల ప్లాంట్ ప్రారంభం



లక్ష్మీపురం (చల్లపల్లి): కేసీపీ షుగర్స్ యాజమాన్యానికి ఎనభై ఏళ్లుగా ఈ ప్రాంత రైతులతో ఉన్న అనుబంధం వీడలేక లక్ష్మీపురం కేసీపీ ప్రాంగణంలో మినప గుళ్ల ప్లాంట్ ఏర్పాటు చేశామని కేసీపీ షుగర్స్ యూనిట్ హెడ్ వై.సీతారామదాస్ తెలిపారు. చల్లపల్లి మండలం లక్ష్మీపురంలో కేసీపీ చక్కెర కర్మాగారం ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన కేసీపీ మినప గుళ్ల ప్లాంట్‌ను శుక్రవారం రాత్రి పూజలు చేసి ప్రారంభించారు. యూనిట్ హెడ్ వైఎస్ఆర్ దాస్ మాట్లాడుతూ లక్ష్మీపురం కేసీపీ పరిసర గ్రామాల రైతులు ఈ ప్లాంట్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మిల్ టెక్ కంపెనీ చానల్ పార్టనర్ చిట్టూరి నాగేంద్రకుమార్, ఉయ్యూరు కేసీపీ షుగర్స్ జీఎం వి.పున్నారావు, లక్ష్మీపురం ప్లాంట్ జీఎం (అడ్మిన్) జి.బుల్లి పిచ్చియ్య, ఫైనాన్స్ మేనేజర్ సంపత్ కుమార్, మేనేజర్లు పాల్గొన్నారు.

SBI భారతీయ స్టేట్ బ్యాంక్
మెయిన్ బ్రాంచ్ (00874). మచిలీపట్నం, కృష్ణా జిల్లా

స్వాధీనత ప్రకటన
(స్థిరాస్తి కొరకు) [APPENDIX IV (రూల్ - 8(1)]

Home Loan A/c.No's. 37712097455,
Home Top UpLoan A/c.No. 38858564867

[illegible] భారతీయ స్టేట్ బ్యాంక్, మెయిన్ బ్రాంచ్ (00874), మచిలీపట్నం, కృష్ణా జిల్లా [illegible] 2002 (నెం.54 ఆఫ్ 2002) [illegible] రూల్స్, 2002 [illegible] 13(12) [illegible] **ఋణగ్రహీత : శ్రీ ఆరేపల్లి సీతారామయ్య, తండ్రి : పాండు రంగారావు**, [illegible] డి.నెం.15/207-21-2బి, వార్డు నెం.16, మాచవరం, మచిలీపట్నం-521002. [illegible] మొత్తం రూ.**34,05,567/-** [illegible] **తేది.16.11.2022** [illegible] 60 రోజులలోగా [illegible] **తేది.15.11.2022** న డిమాండ్ నోటీసును జారీ చేసినారు.

[illegible] సెక్షన్ 13(4) [illegible] **తేది.30-01-2023** [illegible]

[illegible] సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8) [illegible]

[illegible] మొత్తము రూ.34,05,567/- మరియు దానిపై **తేది.16-11-2022** నుండి [illegible] **భారతీయ స్టేట్ బ్యాంక్, మెయిన్ బ్రాంచ్ (00874)**, మచిలీపట్నం, **కృష్ణా జిల్లా** [illegible]

స్థిరాస్తి వివరములు

కృష్ణాజిల్లా, మచిలీపట్నం [illegible], మచిలీపట్నం మున్సిపాలిటీ, మాచవరం, [illegible] అసెస్మెంట్ నెం.1070049920, మున్సిపల్ వార్డు నెం.16, డోర్ నెం.15/207-21 [illegible] డోర్ నెం.15/207-21-2బి, [illegible] నెం.198 [illegible] 211.51 [illegible] 3850/2017, తేది.15.09.2017 ప్రకారం **శ్రీ ఆరేపల్లి సీతారామయ్య, తండ్రి : పాండు రంగారావు** గారికి చెందినది. **హద్దులు : ఉత్తరం** : 30'.0" [illegible] -40'.0", **దక్షిణం** : ప్లాట్ నెం.34 లో [illegible] 40'.0", **తూర్పు** : ప్లాట్ నెం.44లో [illegible] 57'.0", **పడమర** : ప్లాట్ నెం.46 లో [illegible] 57'.0".

తేది : 30.01.2023
ప్రదేశం : మచిలీపట్నం

సం/- అధీకృత అధికారి
భారతీయ స్టేట్ బ్యాంక్

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

మచిలీపట్నం డివిజన్
99122 20543, 79950 92116 (మచిలీపట్నం, పెడన)
99122 20545 (అవనిగడ్డ)
Office mail : sakshiads@gmail.com